




EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

గురువారం

20-03-2025

పేజీలు: 02




## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 20 మంది మావోలు హతం

ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం ఉదయం నుంచి ఈ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ దాడుల్లో 20 మంది మావోయిస్టులు హతం అయ్యారు. గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీజాపూర్-దంతేవాడ సరిహద్దులోని అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు-మావోల మధ్య ఈ ఎదురుగాల్పులు జరిగాయి. ప్రస్తుతం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని బీజాపూర్ పోలీసులు తెలిపారు.ఇదిలా ఉంటే నారాయణపూర్ జిల్లా అబుజ్మద్‌లో మావోలు ఐఈడీ పేలుడుకు పాల్పడ్డారు. ఈ పేలుడు కారణంగా ఒక జవాన్, ఒక అధికారి కళ్లలోకి దుమ్ము, బురద వెళ్లినట్లుగా తెలిపారు. చికిత్స కోసం వారిని వేరే ప్రాంతానికి తరలించారు.



## హమాస్‌తో సంబంధాలు.. అమెరికాలో భారతీయ విద్యార్థి అరెస్ట్

పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్‌తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై ఓ భారతీయ విద్యార్థిని అమెరికా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాషింగ్టన్ డీసీలోని జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలో పరిశోధకుడైన భారతీయ విద్యార్థి బదర్ ఖాన్ సూరి స్టూడెంట్ వీసాపై అమెరికాలో ఉంటున్నాడు. అయితే, వర్సిటీలో అతడు హమాస్ ఉగ్రసంస్థకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీని ఉటంకిస్తూ ఫాక్స్ న్యూస్ నివేదించింది. ఈ మేరకు సోమవారం రాత్రి వర్జీనియాలోని అతని ఇంటి వెలుపల ఫెడరల్ ఏజెంట్లు అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. అతడి వీసాను కూడా రద్దు చేసినట్లు పేర్కొంది. అయితే, తన అరెస్ట్‌పై సూరి ఇమిగ్రేషన్ కోర్టులో సవాల్ చేశారు. తనకు ఎలాంటి నేర చరిత్ర లేదని, తన భార్యకు పాలస్తీనా మూలాలున్న కారణంగానే తనను లక్ష్యంగా చేసుకున్నారని కోర్టులో ఆయన పేర్కొన్నట్లు తెలిసింది.



## నేను చిరంజీవిని తండ్రిలా భావిస్తా

తన అన్నయ్య మెగాస్టార్ చిరంజీవికి యూకే పార్లమెంట్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు రావడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. అన్నయ్య మెగాస్టార్ చిరంజీవిపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రశంసల జల్లు కురిపించారు.సాధారణ మధ్యతరగతి ఎక్సైజ్ కానిస్టేబుల్ కొడుకుగా జీవితం మొదలుపెట్టి, స్వశక్తితో, కళామతల్లి దీవెనలతో, చిత్ర రంగంలో మెగాస్టార్‌గా ఎదిగారని కొనియాడారు. నాలుగున్నర దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను అలరిస్తూ, తన నటనతో ఉత్తమ నటుడిగా 9 ఫిలింఫేర్ అవార్డులు, 3 నంది అవార్డులు అందుకుని, నటనకు పర్యాయపదంగా నిలిచిన వ్యక్తి మెగాస్టార్ చిరంజీవి అని ప్రశంసించారు. మెగాస్టార్ చిరంజీవికి తమ్ముడిగా పుట్టినందుకు ఎప్పుడూ గర్విస్తూనే ఉంటాను అని అన్నారు. తాను చిరంజీవిని ఒక అన్నయ్య గా కంటే ఒక తండ్రి సమానుడిగా భావిస్తాను. నేను జీవితంలో ఏం చేయాలో తెలియక, అయోమయంలో ఉన్న పరిస్థితుల్లో నాకు మార్గం చూపించిన వ్యక్తి మెగాస్టార్ చిరంజీవి అని కొనియాడారు. నా జీవితానికి హీరో అన్నయ్య చిరంజీవి అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొనియాడారు.

ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాత చిరంజీవి మెగాస్టార్ చిరంజీవి తన సేవా భావంతో చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ స్థాపించడం ద్వారా ఆపదలో ఉన్నవారికి రక్తదానం, నేత్రదానం అందిస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు .తననే కాకుండా కోట్లాదిమంది అభిమానులను సమాజ సేవకులుగా మార్చిన స్ఫూర్తి ప్రదాత తన సోదరుడు మెగాస్టార్ చిరంజీవి అని ప్రశంసించారు. తాను ఎదగడమే కాకుండా తన కుటుంబంతో పాటుగా, ఎంతోమంది ఎదుగుదలకు ప్రత్యక్షంగాను పరోక్షంగాను సహాయ సహకారాలు అందిస్తూ, టాలెంట్ ఉన్న ఎవరైనా సరే ఏ రంగంలో అయినా సరే రాణించవచ్చు అనేందుకు ఉదాహరణగా నిలిచారు. ఆయన సమాజానికి అందించిన సేవలకు గాను ఇటీవలే భారత ప్రభుత్వం రెండవ అత్యున్నత పౌర పురస్కారం పద్మ విభూషణ్ పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ చేతుల మీదుగా అందుకున్నారు అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గుర్తుచేశారు.

**జనసేనని బలమైన పార్టీగా నిర్మిస్తాం**

జనసేనను రానున్న రోజుల్లోమరింత బలమైన పార్టీగా నిర్మాణం చేస్తామని ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో నిర్వహించిన 'జయకేతనం' ఆవిర్భావ సభ విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ బుధవారం 'ఎక్స్'లో ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్‌లో తమ పార్టీ సామాన్యుల గొంతుకగా మారుతుందని, రాష్ట్రప్రయోజనాలు, జాతీయ ఐక్యత లక్ష్యంగా, మరింత బాధ్యతతో పనిచేసే దిశగా అడుగులు వేయనుందని తెలిపారు. జనసేన 11 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం పూర్తిచేసుకుని.. 12వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకొన్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరికి, ఎన్డీయే నాయకులు, చిత్రపరిశ్రమ మిత్రులు, శ్రేయోభిలాషులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు.



కామారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

## కానిస్టేబుల్ మృతి

కామారెడ్డి జిల్లా గాంధారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ రవి (38) అక్కడిక్కడే మరణించాడు. గాంధారి పోలీస్ స్టేషన్లో కానిస్టేబుళ్ళుగా పనిచేస్తున్న రవి, సుభాష్ తెల్లవారుజామున పెట్రోలింగ్ చేస్తూ రోడ్డు పక్కన నిలబడ్డారు, ఈ సమయంలో ఒక కారు అతి వేగంగా వారిపైకి దూసుకొచ్చింది, దీంతో కానిస్టేబుల్ రవి గాల్లో ఎగిరి పడ్డాడు. కారును ముందుగానే గమనించిన సుభాష్ పక్కకి పరిగెత్తగా ప్రాణాలు దక్కాయి, కానీ రవి అనే కానిస్టేబుల్ అక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

## బడ్జెట్‌లో క్రీడలకు 465 కోట్లు

తెలంగాణ వార్షిక బడ్జెట్‌లో క్రీడా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం 465 కోట్లు కేటాయించింది. బుధవారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పలు ప్రాతిపాదనలు చేశారు. సిటీ పరిసరాల్లో ఉన్న హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని, ఫోర్త్ సిటీలో స్పోర్ట్స్ హబ్ సహా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో 12 క్రీడా అకాడమీలు ఏర్పాటు చేస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ రాష్ట్రానికి మంచి పేరు తీసుకొచ్చిన మహ్మద్ సిరాజ్, నిఖత్‌జరీన్, దీప్తి జివాంజీ పేర్లను బడ్జెట్ ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. బడ్జెట్‌లో సముచిత రీతిలో నిధులు కేటాయించడం పట్ల సాట్స్ సిబ్బంది, ప్లేయర్లు, కోచ్‌లు సంతోషం వ్యక్తం చేశారు. కేటాయింపులకు తగ్గట్లు క్రీడలను అభివృద్ధి చేయాలని వారు ఆకాంక్షించారు. రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు.



వైష్ణవితో ముద్దుకోసం సిద్ధు తంటాలు..

## 'జాక్' నుంచి 'కిస్' మెలోడీ రిలీజ్

యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ తాజాగా నటిస్తున్న చిత్రం జాక్. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకి శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మువీ నుంచి కిస్ అనే మెలోడి సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సాంగ్ చూస్తుంటే.. వైష్ణవితో ముద్దుకోసం పిచ్చికుక్కలా తన వెంట తిరుగుతుంటాడు సిద్ధు.

## సూర్యాపేట జిల్లాలో దారుణం



స్నేహం ముసుగులో మోసాలు చేస్తారని విన్నాం కానీ, మరీ ఇంత నీచానికి దిగజారిపోతారని ఇప్పుడే తెలుస్తోంది. అసలు ఏ మాత్రం భయం లేకుండా, తప్పు చేస్తామనే ఇంకితం లేకుండా ఓ ఆడపిల్ల జీవితం నాశనం చేసింది మరో యువతి.స్నేహం పేరుగా మంచిగా నటించి, ఓ రోజు ఫ్రెండ్‌ను ఇంటికి పిలిచింది. పార్టీ చేసుకుందామంటూ ఆమెతో బలవంతంగా మద్యం తాగించి, మత్తు ఎక్కిన తర్వాత తన ప్రియుడితో ఆమెపై అత్యాచరం చేయించింది. ఆ దారుణాన్ని వీడియో కూడా తీసింది. ఈ ఘటన సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. హుజూర్ నగర్ పట్టణానికి చెందిన ఓ యువతిపై ఆమె స్నేహితురాలు దారుణానికి ఒడిగట్టింది.పార్టీ చేసుకుందామని ఇంటికి పిలిచి, బలవంతంగా మద్యం తాగించి తన ప్రియుడు ప్రమోద్‌తో ఆమె అత్యాచారం చేయించింది. ఆ దృశ్యాలను వీడియో తీసి తర్వాత బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడింది. బాధితురాలిని హుజూరాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సమీపానికి తీసుకెళ్లింది. మళ్లీ మద్యం తాగించి ఈ సారి ప్రమోద్‌తో పాటు అతని స్నేహితుడు హరీశ్ కూడా అత్యాచారానికి పాల్పడ్డాడు. మత్తులో ఉన్న సదరు యువతిపై ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ సమయంలోనే బాధితురాలి ప్రైవేటు వీడియోలు, ఫొటోలు తీశారు.విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తామని బెదిరించి ఇంటి వద్ద వదిలిపెట్టారు. అయితే ప్రైవేటు వీడియోలు తీసిన కామాంధులు బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించారు. తాము ఫోన్ చేసి పిలిచినప్పుడల్లా రావాలని, అడిగినంత డబ్బు ఇవ్వాలని బెదిరింపులకు దిగారు. రాకపోతే ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతామంటూ భయపెట్టారు. వారి బెదిరింపులతో విసిగిపోయిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇద్దరు యువకులు, వారికి సహకరించిన మరో యువతిపైనా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్

రష్యా – ఉక్రెయిన్ యుద్ధం ముగింపు కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా కృషి చేస్తున్న విషయం తెలిసిందే. రెండు దేశాల మధ్య శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం రష్యా, ఉక్రెయిన్ అధ్యక్షులతో విడివిడిగా సంప్రదింపులు జరుపుతున్నారు. మంగళవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ సంభాషించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌లోని విద్యుత్తు ప్లాంట్లను భద్రత నిమిత్తం తమకు అప్పగించాలని ట్రంప్ సూచించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రుబియా తెలిపారు.

గాజాపై మరోసారి ఇజ్రాయెల్ దాడులు..


## 70 మంది మృతి

ఇజ్రాయెల్ – హమాస్ యుద్ధంతో పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంది. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ మరోసారి విరుచుపడుతోంది. రెండు రోజుల క్రితం గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 400 మందికిపైగా పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం ఉదయం గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుపడింది. తాజా దాడుల్లో ఓ మహిళ, పిల్లలు సహా కనీసం 70 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా పౌర రక్షణ సంస్థను ఉటంకిస్తూ అల్‌జజీరా నివేదించింది. ఇజ్రాయెల్ దళాలు గాజాలోకి ప్రవేశించి ఉత్తర, దక్షిణ గాజాను విభజించే నెట్‌జారిమ్ కారిడార్‌లోని కొంత భాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాయి. ఇక్కడినుంచి పాలస్తీనావాసుల కదలికలను నియంత్రించే వెసులుబాటు దానికి దక్కింది. గాజా కారిడార్‌లో అత్యంత కీలకమైన



కొంతభాగాన్ని స్వాధీనం చేసుకోవడానికి పరిమితస్థాయి 'గ్రౌండ్ ఆపరేషన్' చేపట్టినట్టు ఇజ్రాయెల్ సైన్యం బుధవారం ప్రకటించింది. బందీలను హమాస్ విడిచిపెట్టకపోతే, ఊహించలేని స్థాయిలో దాడులు ఉంటాయని ఇజ్రాయెల్ రక్షణమంత్రి హెచ్చరించారు. కాగా, గాజా స్ట్రిప్‌పై మంగళవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా దాదాపు 404 మంది ప్రాణాలు కోల్పోయారని, 500 మందికిపైగా గాయపడ్డారని గాజా వైద్య శాఖ అధికారులు వెల్లడించారు. జనవరి నుంచి కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్న తరుణంలో ఇజ్రాయెల్ అనూహ్యంగా ఈ దాడులకు దిగింది. దీంతో ఏడాదిన్నరగా సాగిన యుద్ధం మళ్లీ ప్రజ్వరిల్లే సూచనలు కనిపిస్తున్నాయి. కాల్పుల విరమణకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఇటలీ, ఖతార్ సహా పలు దేశాలు ఇజ్రాయెల్ దాడులను ఖండించాయి.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# విజయ్‌తో బ్రేకప్ తూచేనా?

లస్ట్ స్టోరీస్ 2 షూటింగ్ సమయంలో తమన్నా - విజయ్ ప్రేమలో పడ్డారు. ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుండటంతో మీడియా అప్పట్లోనే కోడై కూసింది. దీంతో సీక్రెట్‌గా తమ రిలేషన్ మెయింటైన్ చేసిన జంట దానిని ఎక్కువ రోజులు దాచలేకపోయింది. ఓ రోజున తమన్నానే స్వయంగా విజయ్‌తో తాను ప్రేమలో పడినట్లు క్లారిటీ ఇచ్చింది. విజయ్ కూడా తమన్నా తన బెస్ట్ ఛాయిస్ అంటూ ఓపెన్ అయిపోయాడు. విషయం అఫీషియల్ కావడంతో ఈ జంట పబ్లిక్‌గానే పార్టీలు, ఫంక్షన్లు, ఈవెంట్లకు కలిసి తిరగడం మొదలుపెట్టింది.ఇదే ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. ఈ కోట్ విజయ్‌దని అంతా చర్చించుకుంటున్నారు. గతంలో వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నప్పుడు ఈ కోట్‌తో ఇద్దరూ దిగిన ఫోటోలు వైరల్ చేస్తున్నారు. తమన్నా నిజంగానే విజయ్‌తో విడిపోయిందా ? లేక ఇద్దరూ కలిసే ఉన్నారా అంటూ నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. దీనిపై ఎవరో ఒకరు స్పందిస్తేనే కానీ ఈ పుకార్లకు తెరపడదు.

# రాజస్థాన్ రాయల్స్‌కు భారీ షాక్

శాంసన్ స్థానంలో స్టార్ బ్యాటర్ రియాన్ పరాగ్ కెప్టెన్‌గా బాధ్యతలు

ఐపీఎల్ 2025 ప్రారంభానికి ముందు రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) జట్టుకు షాక్ తగిలింది. కెప్టెన్ సంజు శాంసన్ ఈ ఎడిషన్‌లో రాజస్థాన్ ఆడే తొలి మూడు మ్యాచ్‌లకు సారథ్యం వహించడని ఆర్ఆర్ ఎక్స్ వేదికగా తెలిపింది. ఫిట్‌నెస్ సమస్య కారణంగా కేవలం స్పెషలిస్ట్ బ్యాటర్‌గా మాత్రమే ఆడతాడని పేర్కొంది. శాంసన్ స్థానంలో స్టార్ బ్యాటర్ రియాన్ పరాగ్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. 'ఐపీఎల్ 2025లో సంజు శాంసన్ మొదటి మూడు మ్యాచ్‌లలో బ్యాటర్‌గా మాత్రమే ఆడతాడు. ఫిట్‌నెస్ కారణంగా కీపింగ్ మరియు ఫీల్డింగ్ విధులు నిర్వర్తించడు. రాజస్థాన్ రాయల్స్ ఆడే తొలి మూడు మ్యాచ్‌లలో రియాన్ పరాగ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.శాంసన్ పూర్తిగా ఫిట్‌నెస్ సాధించాక కెప్టెన్‌గా తిరిగి బాధ్యతలు చేపడతాడు' అని రాజస్థాన్ రాయల్స్ పేర్కొంది. ఐపీఎల్ 18వ ఎడిషన్ మార్చి 22 నుండి ఆరంభం కానుంది. ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య లీగ్ మొదటి మ్యాచ్ జరగనుంది. మార్చి 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో రాజస్థాన్ తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో సంజు శాంసన్‌కు గాయం అయింది. గాయం కారణంగా మిగిలిన సిరీస్‌కు దూరమయ్యాడు. శస్త్రచికిత్స అనంతరం కోలుకుని. తిరిగి ప్రాక్టీస్ మొదలెట్టాడు. మార్చి 26, మార్చి 30 తేదీల్లో కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్‌తో రాజస్థాన్



తలపడనుంది. 2008లో తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకున్న రాయల్స్.. గత సంవత్సరం పట్టికలో మూడవ స్థానంలో నిలిచి ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఎలిమినేటర్‌లో ఓడిపోవడంతో ఫైనల్‌కు చేరుకోలేకపోయింది.



## రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

రాజస్థాన్‌లోని బికనీర్‌లో బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇక్కడి డెష్నోక్ ప్రాంతంలో ఉన్న ఓవర్ బ్రిడ్జిపై, ఒక డంపర్ ప్రయాణిస్తున్న కారుపైకి బోల్తా పడింది. దీని కారణంగా, కారులో ఉన్న 6 మంది వ్యక్తులు బాధాకరమైన మరణం చెందారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని చెబుతున్నారు. ఈ వ్యక్తులు ఒక వివాహ వేడుకకు హాజరైన తర్వాత ఇంటికి తిరిగి వస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సీనియర్ పోలీసు, పరిపాలన అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, ఈ విషాద ప్రమాదం రాత్రి 2.30 గంటల ప్రాంతంలో జరిగింది. ఆ సమయంలో డెష్నోక్ నుండి నోఖాకు ఒక కారు వెళుతోంది. కారులో ఆరుగురు వ్యక్తులు ఉన్నారు. ఈ వ్యక్తులు ఒక వివాహ వేడుకకు హాజరు కావడానికి దేశ్నోక్ కు వచ్చారు. ఆ తరువాత, మేము రాత్రి ఆలస్యంగా నోఖాకు తిరిగి వెళ్తున్నాము. అదే సమయంలో, డెష్నోక్ ఓవర్ బ్రిడ్జిపై కారుతో పాటు వెళ్తున్న డంపర్ దానిపై బోల్తా పడింది. దీని కారణంగా కారు బాగా నుజ్జునుజ్జు అయి, అందులో ఉన్న వ్యక్తులు సజీవ దహనమయ్యారు.

## రోజుకు రూ. 5 వేలు ఇస్తేనే వస్తా..!



భార్య వేధిస్తోందని ఆత్మహత్య చేసుకున్న భర్తల గురించి బెంగళూరులో వార్తలు వస్తుంటాయి. అదే రీతిలో భార్య సతాయిస్తోందని గోడు వెళ్లబోసుకున్నాడు ఓ భర్త. దగ్గరకు పిలిస్తే, రోజుకు రూ. 5 వేలు ఇస్తేనే వస్తానంటోందని వాపోయాడు. ఆమె వేధింపులను తట్టుకోలేక టెక్కీ భర్త పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు.. టెక్కీ శ్రీకాంత్‌కు 2022లో సదరు యువతితో వివాహమైంది. పెళ్లి రోజు నుంచి ఒక్కరోజు కూడా సంసారం చేయలేదు. పిల్లలు కావాలని శ్రీకాంత్ భార్యను అడగ్గా, 60 ఏళ్లు వయస్సు వచ్చినప్పుడు ఆ సంగతి చూద్దాం, ఇప్పుడైతే ఎవరినైనా దత్తతకు తీసుకొందామని ఉచిత సలహాలిచ్చేది. భార్య కదా అని ఆమెను ముట్టుకోబోతే భగ్గుమనేది. డెత్‌నోట్ రాసి ఆత్మహత్య చేసుకొంటానని బెదిరించేది. భర్త వర్క్ ఫ్రం హోంలో డ్యూటీ చేసుకుంటుంటే చాలు, ఆమె గట్టిగా పాటలు పెట్టి డ్యాన్స్ చేసేది. ఒక వేళ విడాకులు తీసుకోవాలని అనుకుంటే తనకు రూ.45 లక్షలు పరిహారం ఇవ్వాలని, ప్రతినెలా భరణం కింద పెద్దమొత్తం ముట్టజెప్పాలని తేల్చిచెప్పింది. ఇంత డబ్బును తానెక్కడి నుంచి తెచ్చి ఇవ్వాలని బాధితుడు వాపోయాడు. ఇదే కాకుండా వీరిద్దరూ మాట్లాడిన ఆడియో సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. భార్యకు ఆమె తల్లిదండ్రులు వంత పాడుతున్నారని తెలిపాడు. ఈ మేరకు వయ్యలికావల్ ఠాణాలో అతడు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

## విద్యార్థినితో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

బుధవారం జిల్లాలోని టేకులపల్లి మండలం సంపత్ నగర్ గిరిజన్ ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడనే ఆరోపణలతో గ్రామస్తులు ఒక హిందీ ఉపాధ్యాయుడిని కొట్టారు. మంగళవారం మద్యం మత్తులో ఉన్న నిందితుడు మాలోత్ ప్రతాప్ సింగ్ బాలికను పాఠశాలలోని ఒక గదిలోకి తీసుకెళ్లి తన కోరికలు తీర్చుకోవాలని బలవంతం చేశాడని చెబుతున్నారు. ఉపాధ్యాయుల దుశ్చర్యను గమనించిన ఆమె స్నేహితులు ఆమెను రక్షించి తరగతి గది తలుపు తెరవడంతో బాలిక తప్పించుకోగలిగింది.బాలిక కుటుంబం మరియు గ్రామస్తులు ఈ సంఘటన గురించి తెలుసుకున్న తర్వాత, సింగ్‌ను ప్రశ్నించడానికి వారు పాఠశాలకు చేరుకున్నారు, కానీ అతను అప్పటికి పారిపోయాడు.గ్రామస్తులు మరియు కుటుంబ సభ్యులు బుధవారం మధ్యాహ్నం మళ్ళీ పాఠశాలకు వచ్చి సింగ్‌ను పాఠశాలలో కనుగొని, కోపంతో అతనిని కొట్టారు. పాఠశాల సిబ్బంది సహాయంతో, అతను పాఠశాల నుండి తప్పించుకోగలిగాడు.యెల్లెందు ఐటీడీఏ మరియు బోడు పోలీసులు పాఠశాలను సందర్శించి సంఘటన గురించి విచారించారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు బోడు సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీకాంత్ మీడియాకు తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదు ఆధారంగా, నిందితుడిపై పోక్సో చట్టంలోని నిబంధనల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు SI తెలిపారు.





## గన్‌మెన్‌ల సంరక్షణలోనే ఉండండి..

### ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అప్రమత్తం చేసిన పోలీసులు

వరుస బెదిరింపు కాల్స్ నేపథ్యంలో హైదరాబాద్ గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోలీసులు అప్రమత్తం చేశారు. సెక్యూరిటీ లేకుండా బయ తిరగొద్దని, గన్‌మెన్లు లేకుండా నేరుగా ప్రజల్లోకి వెళ్లవద్దని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే మీ ప్రాణాలకు, భద్రతకు ముప్ప పొంచిఉన్నదని హెచ్చరించారు. ప్రభుత్వం కేటాయించిన బుల్లెట్‌ప్రూఫ్ కారులోని తిరగాలని, 1+4 సెక్యూరిటీ సిబ్బందిని వినియోగించుకోవాలని తెలిపారు. బైక్‌పై తిరగొద్దని సూచించారు. భద్రత విషయంలో పూర్తిస్థాయిలో సహకరించాలని సిటీ పోలీసులు కోరారు. ఈ మేరకు మంగల్‌హాట్ పోలీసులు ఎమ్మెల్యేకు నోటీసులు పంపించారు.కాగా, రాజాసింగ్‌కు గత నెల 25న బెదిరింపు కాల్స్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ రోజు కాకపోతే రేపైనా నీ తల నరికేస్తామని ఆగంతకులు తనన బెదిరించినట్లు రాజాసింగ్ తెలిపారు. రెండు గుర్తుతెలియని ఫోన్ నంబర్ల నుంచి బెదిరింపులు వచ్చాయని చెప్పారు. గతంలోనూ ఆయనకు పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి బెదిరింపులు వచ్చాయి. దీంతో పోలీసులు నిందితులను గర్తించి పట్టుకున్నారు. రాజాసింగ్ హత్యకు కుట్ర పన్నినట్లు విచారణలో తేలింది.

# బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం.. విచారణకు హాజరైన విష్ణుప్రియ

బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం వ్యవహారంలో నటి విష్ణుప్రియ పోలీసు విచారణకు హాజరయ్యారు. గురువారం ఉదయం పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆమె.. విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం కల్పిస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, టీవీ నటులపై కేసులు నమోదయ్యాయి. ఇమ్రాన్‌ఖాన్, హర్షసాయి, టేస్టీ తేజ, కిరణ్ గౌడ్, విష్ణుప్రియ, శ్యామల, రీతూ చౌదరి, సుప్రీత, అజయ్, సన్నీ యాదవ్, సందీప్‌లపై బీఎన్ఎస్ 318(4) 3, 3ఏ, టీఎస్‌జీఏ, 66డీఐటీఏ-2008 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణకు రావాలంటూ విష్ణుప్రియకు పంజాగుట్ట పోలీసులు ఇప్పటికే నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ బెట్టింగ్ యాప్స్ కారణంగా చాలామంది లక్షలాది రూపాయలు నష్టపోయిన విషయం తెలిసిందే. ఇటీవల సోషల్ మీడియాలో ఈ బెట్టింగ్ యాప్స్‌పై పోరాటం జరుగుతున్నది. దీనికి తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ వీసీ సజ్జనార్ సైతం మద్దతు పలికారు. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసే వారిని అన్‌ఫాలో చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో పలువురు బెట్టింగ్ యాప్స్‌ని ప్రచారం చేసిన వారంతా.. ఇప్పుడు తమ వీడియోలను తొలగిస్తు న్నారు. తాము తెలియక తప్పులు చేశామని.. మరోసారి అలాంటి తప్పులు చేయమోమని ప్రకటిం చారు. బెట్టింగ్ యాప్స్‌ని ఎవరూ నమ్మొద్దంటూ సూచిస్తున్నారు.



## పోలీస్ కానిస్టేబుళ్ల నియామకాలు చేపడతాం: హోంమంత్రి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ ఉద్యోగాలు, పోలీస్ వెల్ఫేర్‌పై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సభ్యులు కొణతాల రామకృష్ణ ప్రశ్నించారు. ఇందుకు హోంమంత్రి వంగలపూడి అనిత సమాధానాలు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న 16,862 కానిస్టేబుల్ పోస్టుల్లో 6,100 పోస్టుల నియామకం పూర్తి కానుందని తెలిపారు. మిగిలిన 10,762 ఖాళీల నియామకానికి ప్రభుత్వానికి, డీజీపీ గారికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని చెప్పారు. అనుమతులు రాగానే మిగిలిన పోలీస్ కానిస్టేబుళ్ల నియామకాలు చేపడతాం అని హోంమంత్రి చెప్పుకొచ్చారు. 'రాష్ట్రంలో మొత్తం 16,862 కానిస్టేబుల్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. 2014 -19 మధ్య కాలంలో సీఎం చంద్రబాబు పాలనలో 7,623 కానిస్టేబుల్ నియామకాలు చేపట్టాం. ప్రస్తుతం ఉన్న 16,862 కానిస్టేబుల్ పోస్టుల్లో 6,100 పోస్టుల నియామకం పూర్తి కానుంది. మిగిలిన 10,762 ఖాళీల నియామకానికి ప్రభుత్వానికి, డీజీపీ గారికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. అనుమతులు రాగానే మిగిలిన పోలీస్ కానిస్టేబుళ్ల నియామకాలు చేపడతాం. పోలీసుల వెల్ఫేర్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రమాదవశాత్తు చనిపోతే 10 నుంచి 15 లక్షల వరకు వచ్చే ఏర్పాటు చేస్తాం' అని హోంమంత్రి అనిత చెప్పారు. కేంద్ర ప్రాయోజిత పథకాలపై సభ్యులు కూన రవికుమార్, ధూళిపాళ్ల నరేంద్ర, గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రశ్నలు అడిగారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ___ 'కేంద్ర ప్రాయోజిత పథకాలు 94 ఉన్నాయి. 24 పథకాలను కేంద్రం ఆపేసింది. గత ప్రభుత్వం కేంద్ర పథకాలు పట్టించుకోలేదు. నిధులు డైవర్ట్ చేసింది. ప్రస్తుతం కేంద్ర పథకాలపై దృష్టి పెట్టాము' అని పేర్కొన్నారు.

